సాక్షి
బాపట్ల
మంగళవారం ¦ 15 ¦ జూలై ¦ 2025



వైభవంగా స్వామి వారి కల్యాణం

నగరంపాలెం: గుంటూరులోని శ్రీగౌరీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శతాబ్ది మహోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట: ఇస్సపాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి దివ్వెల శివశంకరరావు జ్ఞాపకార్థం వారి వారసులు రూ.1,01,116 నగదును అందజేశారు.



దుర్గమ్మ సేవలో చాగంటి దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు దంపతులు సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

ఇసుకప్పగింతలు

- చీరాలలో ఇసుక అమ్ముకునేందుకు పచ్చనేతకు ప్రతి నెలా అందనున్న ఫైకం
- నియోజకవర్గంలో జోరందుకున్న ఇసుక దందా
- ఆదివారం కొబ్బరికాయ కొట్టి ఇసుక తవ్వకాలు ప్రారంభించిన వేలంపాట నిర్వాహకుడు
- పందిళ్లపల్లి, దేశాయిపేట నుంచి ఇసుక తరలింపు
- సముద్ర తీరగ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా
- బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో విక్రయం
- అధిక ధరలకు అమ్మకాలు
- అధికారులకు నెల మామూళ్లు !
- భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి ఇబ్బందులు
- ప్రజల ఫిర్యాదులు పట్టించుకోని జిల్లా అధికారులు
- అటు వైపు కన్నెత్తి చూడని మైనింగ్ అధికారులు

"నా నియోజకవర్గం నిండా కావాల్సినంత ఇసుక వుంది. మీకు ఎంతకావాలంటే అంత తీసుకెళ్లి అమ్ముకోండి. పందిళ్లపల్లి, దేశాయి పేటల్లో నిర్మాణాలకు పనికి వచ్చే నాణ్యమైన ఇసుక వుంటే.. సముద్ర తీరంలో బచ్చులవారిపాలెం, చల్లారెడ్డి పాలెం, పొట్టిసుబ్బయ్య పాలెం వరకూ విస్తారంగా ఉన్న ఇసుకను పునాదులు, రియల్ వెంచర్ల ఫిల్లింగ్‌కు వాడుకోవచ్చు. మీకు ఏది డిమాండ్ వుంటే దానిని తీసుకెళ్లి అమ్ముకోవచ్చు. నాకు మాత్రం నెలకు రూ. 30 లక్షలు కప్పం చెల్లించండి. ఇసుక వ్యాపారులకు చీరాల పచ్చ ముఖ్య నేత ప్రతిపాదన ఇది."



ఇసుక కప్పం @ రూ.30లక్షలు



పందిళ్లపల్లి ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చీరాల నియోజగవర్గంలోని చీరాల, వేటపాలెం రెండు మండలాల పరిధిలోని ప్రతి గ్రామంలోనూ కావాల్సినంత ఇసుక లభ్యమవుతుండటంతో పచ్చనేత ప్రతిపాదన ఇసుకదందా నిర్వాహకులకు నచ్చింది. నెలకు రూ. 30 లక్షలు చెల్లించినా మంచి లాభాలే ఉంటాయని లెక్కలు వేసుకున్న పచ్చపార్టీకే చెందిన ఓ ఇసుక వ్యాపారితోపాటు చీరాల ప్రాంతానికి చెందిన మరొక పచ్చనేత కలిపి చీరాల పచ్చనేతకు నెలకు రూ. 30 లక్షలు చెల్లించేందుకు సై అన్నారు.

అక్రమ రవాణాకు శ్రీకారం

చీరాల ప్రాంతానికే చెందిన కొందరు పచ్చనేతలు నెలకు రూ.15 లక్షల వరకూ ఇస్తామని సదరు నేతకు ప్రతిపాదన పెట్టినా ఇసుక అక్రమ వ్యాపారంలో ఆరితేరిన ఇద్దరు పచ్చనేతలు రూ. 30 లక్షలు చెల్లిస్తామనడంతో చీరాల పచ్చనేత వారికే ఇసుక వ్యాపారం అప్పగించారు. అనుకున్నదే తడవుగా ఇసుక వ్యాపారులు ఆదివారం టెంకాయకొట్టి టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణాకు శ్రీకారం చుట్టారు. తొలుత నాణ్యమైన ఇసుక లభ్యమయ్యే పందిళ్లపల్లి, దేశాయి పేటలనుంచి ఇసుకను తరలించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చీరాలనుంచి ఇప్పటికే నిత్యం ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఈ ప్రాంతం నుంచి బాపట్ల, చీరాల నియోజకవర్గాలతోపాటు పర్చూరు ప్రాంతానికి సైతం ఇసుకను తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. కొత్తదందాతో ఇసుక అక్రమ వ్యాపారం మరింతగా పెరగనుంది.

వాన్‌పిక్, అసైన్డ్, అటవీ భూముల్లోనూ..

చీరాల ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతోంది. ఇక్కడి పచ్చనేతలు వాన్ పిక్ భూములనూ వదల్లేదు. ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూములనుంచీ ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. ఇక ఉప్పుతో కూడిన ఇసుక అయినా తీరప్రాంతంలోని ఇసుకను రియల్ వెంచర్లు, పునాదులు పూడ్చడంతో పాటు ఇతర అవసరాలకు రేయింబవళ్లు తరలించి అమ్ముతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో తీరప్రాంతం గుంతలమయంగా మారుతోంది. సీఆర్‌జెడ్ నిబంధనలు ఉన్నా ఆ విభాగం అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదు. ఇసుక అక్రమ తరలింపుతో పందిళ్లపల్లి ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికీ ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతలోని పుల్లరిపాలెం ఎస్టీకాలనీ ప్రజలతోపాటు ఇతరులు పలుమార్లు జిల్లా కలెక్టర్ తోపాటు జాతీయ ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమీషన్ కోరినా అప్పట్లో వేటపాలెం మండల అధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. జిల్లా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు చీరాల ప్రాంతంలో మళ్లీ ఇసుక అక్రమ రవాణా జోరందుకుంది. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.



ఇసుక తరలింపుతో ఏర్పడిన గుంతలు

పోరుపడలేక..

ఇదే పద్ధతిలో కొంతకాలం క్రితం చీరాల పచ్చనేతతో ఇసుక వ్యాపారి ఒప్పందం కుదుర్చుకొని ఒక నెల కప్పం రూ. 30 లక్షలు చెల్లించి ఇసుకను రేయింబవళ్లు తరలించారు. అయితే చీరాల ప్రాంతానికి చెందిన పచ్చ నేతలు అతనికి పోటీగా ఇసుకను అక్రమంగా తరలించి అమ్ముకున్నారు. ఇదే విషయాన్ని ఇసుక వ్యాపారి సదరు పచ్చనేత దృష్టిలో పెడితే అదంతా తనకు సంబంధం లేదని, వ్యవహారం మీరే చూసుకోవాలని చావుకబురు చల్లగా చెప్పారు. పందిళ్లపల్లి ప్రాంతానికి చెందిన కొందరు పచ్చనేతలు ఇసుక అక్రమ రవాణా మానుకోలేదు. వారి పోడు పడలేక ఇసుక వ్యాపారి ఈ వ్యాపారం తన కొద్దని చేతులెత్తి పచ్చనేతకు దండం పెట్టాడు. స్థానిక పచ్చనేతలు నెల మామూళ్లు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో అక్రమ సంపాదన కోసం తహతహలాడే పచ్చనేత తిరిగి ఇసుక వ్యాపారం తెరపైకి తెచ్చారు. దీంతో మరోమారు ఇసుక వ్యాపారి చీరాల ఇసుక దందా నిర్వాహకుడితో కలిసి ఇసుక అక్రమ వ్యాపారానికి సిద్ధపడ్డారు. పచ్చనేత నుంచి వర్తమానం అందిందేమో ఇసుక అక్రమ రవాణా పెద్దస్థాయిలో మొదలైందని తెలిసినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.



ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న మాఫియా

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి

- డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



బాపట్ల: బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్ అన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. పరిష్కరించి, న్యాయం చేయాలని అభ్యర్థించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని డీఆర్వో చెప్పారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని అన్నారు. సమస్య పరిష్కారం అయిన విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలుగులో ధ్రువీకరణ పత్రాన్ని ఫిర్యాదుదారులకు అందించాలన్నారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, ఉప కలెక్టర్ నాగిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినాయకునికి సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో సోమవారం సంకటహరచతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మాచర్ల మాజీ చైర్మన్ తురకా కిషోర్‌పై కేసు



వెల్దుర్తి: మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్, మరో ఇద్దరిపై వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదయింది. 2022లో పార్టీ మారమని టీడీపీ నాయకుడు దారపునేని శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేసినట్లుగా కేసు నమోదయింది. దీనిపై దారపునేని ఆదివారం ఫిర్యాదు చేయగా కిషోర్‌తో పాటు మండలంలోని బోదిలవీడు గ్రామానికి చెందిన మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబురావులపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు. కాగా ఇప్పటికే పలు అక్రమ కేసులతో కిషోర్‌ను ఇబ్బందులకు గురిచేస్తూ, కక్షసాధింపులకు దిగిన కూటమి నేతలు మూడేళ్ల నాటి ఘటనను బూచిగా చూపి మరో అక్రమ కేసు నమోదు చేయించారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

రేపటి నుంచి శివాలయంలో పవిత్రోత్సవాలు

పెదకాకాని: శివాలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నుంచి రాహుకేతువు పూజలు, నవగ్రహపూజలు, రుద్ర, చండీ హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, శాంతి కల్యాణాలతో పాటు అన్ని సేవలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. 19వ తేదీ నుంచి ఆలయంలో స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలు, అన్ని ఆర్జిత సేవలు, రాహుకేతు పూజలు, యథావిధిగా జరుగుతాయన్నారు. దేవస్థానంలో వాహనపూజలు, అన్నప్రాసనలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.

కడతారా.. చస్తారా !

- ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలతో పేదల బతుకులు చిత్తు
- పేదలే టార్గెట్‌గా అప్పులు ఇస్తామని తిరుగుతున్న 26 ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు
- అధిక వడ్డీలు వసూలు చేస్తూ, తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న వైనం
- కిస్తీలు కట్టకుంటే ఇంటిపై స్వాధీనత బోర్డులు
- గతంలో ఆడవాళ్లను బయటికి లాగి ఇళ్లకు సీల్ వేసిన దుస్థితి
- కుటుంబ యజమాని చనిపోయినా బాకీ చెల్లించాల్సిందేనని పట్టు
- ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు దళిత యువకులు

జే.పంగులూరు: ప్రైవేటు కంపెనీల వలలో పడి పేదల బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. మండలంలోని 21 గ్రామాల్లోని దళిత కాలనీలే టార్గెట్‌గా, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని ప్రైవేటు కంపెనీలు చెలరేగుతున్నాయి. ప్రైవేటు కంపెనీలలో రుణాలు ఇచ్చి వారి ఇళ్లను తాకట్టు పెడుతున్నారు. కట్టకుంటే జప్తు పేరుతో ఇళ్లకు సీల్ వేస్తున్నారు.

ఇంటిపై స్వాధీనత ముద్ర

బైటమంజులూరు గ్రామానికి చెందిన ఇంటూరి అనూక్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకున్నాడు. మూడు నెలల నుంచి కిస్తీ చెల్లించకపోవడంతో ఆ ఇంటి గోడపై ఈ ఇల్లు మా ఆధీనంలో ఉంది. దీనిపై హక్కులన్ని మావే, ఇల్లు కొనదలుచుకున్నవారు మమ్మల్ని సంప్రదించాలి అంటూ గోడపై ముద్ర వేశారు. ఇటీవల కాలంలో దళిత కాలనీకి చెందిన ఇద్దరు యువకులు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ అప్పు చెల్లించలేక ఆత్మహత్యయత్నం చేయగా స్థానికులు గుర్తించి వారిని రక్షించినట్లు తెలిపారు.

ప్రభుత్వ అనుమతులు లేకుండా..

బైటమంజులూరు గ్రామంలో పేదల జీవితాను ఫైనాన్స్ సంస్థలు అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 26 ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు తిరుగుతూ పేదలను ఆకర్షిస్తూ అప్పులిచ్చి, అధిక వడ్డీలు వసూలు చేస్తున్నాయి. ఆ వడ్డీలు చెల్లించలేక పేదలు నానా యాతనలు పడుతున్నారు. కూలీ పనుల మీద ఆధారపడి జీవించే పేదలు నెలనెలా రూ.10వేలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సరైన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



ఇంటూరి అనూక్ ఇంటి గోడపై ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వేసిన ముద్ర

భర్త మరణించినా..



మృతుడు పాలపర్తి వెంకటేశ్వర్లు ఇల్లు

బైటమంజులూరు గ్రామ గిరిజన కాలనీకి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు ఫైవ్ స్టార్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ వద్ద ఇల్లు తాకట్టు పెట్టి రూ. 3 లక్షల రుణం తీసుకున్నాడు. చేతికి రూ. 2.75 లక్షలు మాత్రమే ఇచ్చారు. ఇందుకుగాను నెలకు రూ. 7356 కిస్తీ చెల్లిస్తున్నాడు. మొత్తం 84 నెలలు కిస్తీ చెల్లించాల్సి ఉండగా, 36 నెలలు చెల్లించాడు. అయితే అతను మే నెల 29వ తేదీన గుండెపోటుతో మరణించాడు. కుటుంబ పోషణకు దిక్కైన వెంకటేశ్వర్లు మరణించడంతో ఆ కుటుంబం ఆధారం కోల్పోయింది. భర్తపోయిన దుఃఖంలో సీతమ్మ ఉండగా.. సదరు ప్రైవేటు ఫైనాన్స్‌వారు మీ భర్త చనిపోతే మాకేంటి..? మాకు కట్టాల్సిన కిస్తీలు కట్టాల్సిందేనని, లేకుంటే ఇల్లు వేలం వేస్తామంటు బెదిరింపులకు దిగారు.

ప్రతి రోజూ బెదిరిస్తున్నారు



నేను ఐఐఎఫ్ఎల్, బీఎఫ్ఎల్‌లో రుణాలు తీసుకున్నా. ఇటీవల ఆరోగ్యం బాగా లేక, పనులు చేయలేక కిస్తీలు కట్టలేకపోయాను. బాకీలు చెల్లించకపోతే మీ ఇంటికి వచ్చి గోల చేస్తామని, నలుగురిలో పరువు తీస్తామని, రకరకాల బెదిరింపులకు గురిచేస్తున్నారు. ప్రతిరోజూ ఫోన్లు చేస్తూ హెచ్చరికల మెసెజీలు పంపుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– ఆలూరి ఇమ్మానియేలు, బైటమంజులూరు

భయపెడుతున్నారు..



ఇల్లు బాగు చేయించుకోవడం కోసం ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీలో రూ.2.50 లక్షలు లోను తీసుకున్నాను. ఇందుకుగాను నెలకు రూ. 7230 కిస్తీ చెల్లిస్తున్నాం. స్పందన మైక్రో ఫైనాన్స్ లో రూ. 30 వేలు రుణం తీసుకున్నాను. ఇందుకు గాను వారానికి రూ. 1000 కిస్తీ కడుతున్నాం. కేవలం కూలి పనులపై ఆధారపడి జీవించే మాకు ఒక్కోసారి కిస్తీ డబ్బులు అందకపోతే కంపెనీ వాళ్లు భయపెడుతున్నారు.

– కయ్యూల దిబోరా, బైటమంజులూరు

ఇప్పుడెలా.. గురూ!

- ఏరు దాటాక తెప్పతగలేసిన కూటమి సర్కార్
- మెగా పీటీఎంకు భారీ ఖర్చు
- గ్రాంట్‌లు లేక.. రాక అప్పులు చేసి నిర్వహించిన విద్యాసంస్థలు
- ఇప్పటివరకు ఒక్క రూపాయి ఇవ్వని ప్రభుత్వం
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు



చీరాల రూరల్ మండలం ఈపురుపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం (ఫైల్)

చీరాల: ఏరు దాటిసి తెప్పతగలేసిన చందంగా కూటమి పాలన తలపిస్తోంది. విద్యాసంస్థల్లో హడావుడిగా, హంగు ఆర్భాటాలతో యోగాంధ్ర, మెగా పీటీఎం కార్యక్రమాలు నిర్వహించారు. అయితే నిర్వహణకు ఒక్క రూపాయి ఇవ్వకుండా స్కూల్ గ్రాంట్‌లలో 25శాతం వినియోగించి ఏర్పాట్లు చేయాలంటూ ఉచిత సలహా ఇచ్చి సరిపెట్టారు. దీంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు అవాక్కయ్యారు. పాఠశాలల్లో గ్రాంట్లు అంతంతమాత్రంగా ఉండడం, జూనియర్ కళాశాలల్లో అసలు లేకపోవడంతో అప్పో, సొప్పో చేసి కార్యక్రమాలు జరిపించారు. రికార్డుల కోసం ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమం తమకు గుదిబండగా మారిందని ఉపాధ్యాయులు, అధ్యాపకులు వాపోతున్నారు. జిల్లాలో 1432 పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాల, కళాశాలల్లో తల్లిదండ్రుల సమావేశాల నిర్వహణకు రూ.6 నుంచి రూ. 25 వేల వరకు ఖర్చయింది. గత సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే సమావేశాలు నిర్వహించగా, ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో సైతం నిర్వహించారు.

అప్పులతో తిప్పలు

జిల్లాలో మొత్తం 17 జూనియర్ కాలేజీలు ఉన్నాయి. కళాశాలల్లో సమావేశాలకు వచ్చే తల్లిదండ్రులకు, వారి పిల్లలకు మాంసాహారంతో కూడిన భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఉదయం స్నాక్స్, టీ, వాటర్ బాటిళ్లు కూడా పంపిణీ చేయాల్సి ఉంది. వీటిన్నింటిని అధ్యాపకులే అప్పులు చేసి సమకూర్చారు. అలానే టెంట్లు, కుర్చీలు అద్దెకు తెచ్చుకున్నారు. ఒక్కో కళాశాలకు సుమారుగా రూ.25వేలు ఖర్చయింది. ఆ సొమ్మంతటినీ ప్రభుత్వం చెల్లించకపోతే తాము నష్టపోతామని వారు వాపోతున్నారు.

స్కూల్ గ్రాంట్ వాడితే ఎలా ?

మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహణకు అవసరమయ్యే ఖర్చును స్కూల్ గ్రాంట్స్‌ను నుంచి వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. అయితే సంవత్సరానికి స్కూల్‌లో వివిధ రకాల ఖర్చులకు అందించే నగదును ఇటువంటి కార్యక్రమాలకు వినియోగిస్తే.. మరి మిగిలిన కార్యక్రమాలకు నిధులు ఎక్కడనుంచి తెచ్చి వినియోగించాలని ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

కొత్తపల్లిలో పోలీసు జులుం

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభను అడ్డుకున్న పోలీసులు
- కార్యకర్తలు, నాయకులను అదుపులోకి తీసుకున్న వైనం
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు గౌతంరెడ్డి అడ్డగింత

మాచర్ల రూరల్: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం జరగకుండా పోలీసులు అడ్డుకొని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న సంఘటన పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ఎలాగైనా అడ్డుకోవాలనే అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు పోలీసులు కొత్తపల్లి గ్రామానికి చేరుకొని సభ జరగకుండా అడ్డుకున్నారు. గ్రామంలో నివాస గృహాల మధ్య సొంత స్థలంలో పార్టీ కార్యకర్తలు షామియానాలను ఏర్పాటు చేసుకొని సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధమవ్వగా విజయపురిసౌత్ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని సభా నిర్వహణకు అనుమతులు లేవని, పట్టి పరిస్థితిలో సమావేశం జరపటానికి వీలు లేదంటూ హుకూం జారీ చేశారు. దీనిపై అక్కడే ఉన్న కార్యకర్తలు, నాయకులు తమ సొంత స్థలంలో పార్టీ ప్రోగ్రాం చేసుకునేందుకు ప్రత్యేక అనుమతులు అవసరమా.. గతంలో ప్రతిపక్ష నాయకులుగా ఉన్న టీడీపీవారు ప్రతి గ్రామంలో కార్యక్రమాలు చేసేటప్పుడు ఎటువంటి అనుమతులు పొందారని, ఇప్పుడు మమ్మల్ని ఇలా అడ్డుకునే ప్రయత్నాలు చేయటం ఎంత వరకు సబబని వారు ప్రశ్నించారు. అయినా పోలీసులు వినిపించుకోకుండా సభా ప్రాంగణాన్ని ఖాళీ చేయించి, ఇరువురిని అదుపులోకి తీసుకొని రూరల్ సర్కిల్ స్టేషన్‌కు తరలించారు.

గౌతంరెడ్డిని అడ్డుకున్న పోలీసులు

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు కొత్తపల్లి గ్రామానికి వచ్చిన వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజక వర్గ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. సభా నిర్వహణకు అనుమతులు లేవని, మీరు గ్రామంలోనికి రావద్దంటూ ఆయన్ను కారులోనే నిలిపివేశారు. ఆయన తీవ్రంగా స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పాలనను లోపాలను విమర్శించే హక్కును హరించడం బాగాలేదని.. కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించటం తగదంటూ సూచించారు. పోలీసులు అడ్డుకోవటంతో తిరిగి మాచర్లకు వచ్చారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం మేరకే..

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పార్టీ ప్రోగ్రాంని కొత్తపల్లి గ్రామంలో జరగకుండా పోలీసులు ఆంక్షలు విధిస్తూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాచర్ల నియోజకవర్గంలో పక్కాగా అమలు పరుస్తున్నారని నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డి విమర్శించారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అదేవిధంగా మాచర్ల నియోజకవర్గానికి సంబంధించి కొత్తపల్లి గ్రామంలో జరుపుతుంటే పోలీసులను అడ్డుపెట్టుకుని సభను అడ్డుకోవటం దారుణమన్నారు. తమ సొంత స్థలంలో సభ జరుపుతుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం ఇక్కడ స్పష్టంగా అమలవుతుందని అర్థమవుతుందన్నారు.

- పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని నియోజకవర్గానికి రాకుండా అడ్డుకుంటున్నారని, అతి త్వరలో పీఆర్కే ఆధ్వర్యంలో మాచర్ల నడిబొడ్డున పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ లను ప్రజలకు వివరిస్తామన్నారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురెడ్డి కోటిరెడ్డి, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ తదితరులున్నారు.



కొత్తపల్లిలో కార్యక్రమానికి వెళ్తున్న గౌతంరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 438

కొమ్ములు : 198 బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
9,000	10,250	10,200

కాయలు : 240 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,250	10,200

మొత్తం అమ్మకాలు : 328.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 2,000

మోడల్ ధర రూ. 1,500

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	56,583
అమ్మకాలు	53,846
నిల్వ	5,945

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,300
273	10,000–12,500
341	10,000–13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,600
నంబరు–5	10,000–13,500
273	9,800–12,400
341	10,000–13,500
4884	10,000–12,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 13,500
బాడిగ–355	10,000 – 12,400
దేవనూరు డీలక్స్	10,000 – 12,400
ఆర్మూర్	9,600 – 10,800
తాలుకాయలు	5,000 – 6,700

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,400
బాడిగ – 355	10,000–12,500
దేవనూరు డీలక్స్	10,000–12,500
తాలు	5,200 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

ఏదీ.. అన్నదాత సుఖీభవ ?

- రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- బీమా, పరిహారమూ నిల్
- వర్షాలు లేక, గిట్టుబాటు దక్కక రైతులు అవస్థలు



చీరాల: అన్నదాత సుఖీభవం పథకం అదిగో ఇదిగో అంటూ కాలం వెల్లదీస్తుంది. అధికారంలోకి వచ్చిన ఏడాది దాటిపోయినా రైతులకు ఎలాంటి సాయం చేయకుండా అరచేతిలో వైకుంఠం చూపిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. గత ఎన్నికల్లో రైతుల ఓట్లు కొల్లగొట్టి అధికారం చేపట్టిన వాస్త వాన్ని కూటమి నాయకులు విస్మరించారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు. ఏడాది కాలంగా సరైన వర్షాలు లేవు, పంటలు పండలేదు, అర కొరగా వచ్చిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరా దక్కడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల బాగోగులు పట్టించుకోవాల్సిన సర్కారు ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వయానా ముఖ్యమంతి చంద్రబాబుచేసిన ప్రకటనలకే దిక్కులేకుండా పోయింది.

రూ. 480 కోట్ల పెట్టుబడి సాయం హుష్‌కాక్..

మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ పథకం ఎగ్గొట్టారు. ప్రస్తుతం ఇదిగో అదిగో అంటూ రైతులను ఏడాది కాలంగా ఊరిస్తూ వస్తున్నా ఇప్పటికీ అతీగతి లేదు. ఏటా రూ. 20 వేలు ఇస్తామంటూ ప్రకటించినా, జిల్లా రైతులకు మొదటి ఏడాది ఇవ్వాల్సిన మొత్తం రూ. 480 కోట్లు పెట్టుబడి సాయం ఎగొగ్గట్టేశారు. రెండో ఏడాదైనా ఇస్తారని రైతులు ఆశలు పెట్టుకున్నా ఇవ్వడం లేదు. మే అన్నారు, తర్వాత జూన్ 12, 20 అన్నారు. ఆ తర్వాత జూన్ ఆఖరులోపు అంటున్నారు. మళ్లీ జులై ఆఖరికి అని ఊసూరు మనిపిస్తున్నారు. సీఎం, మంత్రుల ప్రకటనలకూ దిక్కులేకుండా పోయింది. పీఎం కిసాన్, కింద ఇచ్చే రూ.6 వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.14 వేలు ఇస్తామనా ప్రకటించినా ఆచరణలోకి రాలేదు. కనీసం రూ. 14 వేలు ఇచ్చినా గతేడాది జిల్లాలో ఉన్న 2.40 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 400 కోట్లు మేర జమ అయ్యేవి. ఈసారి పీఎం కిసాన్ కింద మొదటి విడత ఇవ్వాల్సిన సొమ్ము కూడా జాప్యం చేస్తుండటంతో రైతులు కష్టాల్లో కూరుకుపోతున్నన పరిస్థితి నెలకొంది.

రైతుల అవస్థలు..

అన్నదాత సుఖీభవతోపాటు పంటల బీమా పథకం కింద ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. మరోవైపు పంటలు పండక అప్పుల పాలై పిల్లల చదువులు, పెళ్లిళ్లు భారమై ఆత్మహత్య చేసుకునన రైతు కుటుంబాలకు కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదు. గత జూన్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు దాదాపు పదుల సంఖ్యలో రైతులు వివిధ రూపాల్లో బలవన్మరణ పొందినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినా స్పందించక పోవడంతో బాధితుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇక గత ఖరీఫ్, రబీలో పంటలు దారుణంగా దెబ్బతినడంతో కంటి తుడుపు చర్యగా కరువు మండలాలను ప్రకటించేసి ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో పైసా ఇవ్వకుండా ప్రభుత్వం రిక్త హస్తం చూపించారు. అకాల వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలకు కూడా ఇన్‌పుట్ ఇవ్వకుండా దాట వేశారు. పంట రుణాలు చెల్లించిన రైతులకు పావలా వడ్డీ లేదు. వడ్డీ రాయితీ కరువై అన్నదాత దిక్కు చూస్తున్నా కూటమి ప్రభుత్వం కరుణించే పరిస్థితి కనిపించడం లేదు.

విద్యతోనే పేదల అభివృద్ధి సాధ్యం

- అనంతవరంలో సీతారామరాజు జీవిత చరిత్ర బుర్రకథ
- పాల్గొన్న బుర్రకథ పితామహుడు షేక్ నాజర్ కుమారుడు షేక్ బాపూజీ



అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శిస్తున్న షేక్ బాపూజీ

యద్దనపూడి: విద్యతోనే పేదల అభివృద్ధి సాధ్యం అవుతుందని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో బుర్రకథ పితామహుడు షేక్ నాజర్ కుమారుడు షేక్ బాపూజీ కళా బృందంచే అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను బుర్రకథ ప్రదర్శించారు. ముందుగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు విజయమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ మాట్లాడుతూ విద్య ద్వారానే పేదల అభివృద్ధి సాధ్యం అన్నారు. పేద ప్రజలు తమ పిల్లలను విద్యావంతులుగా చేయాలన్నారు. తమ పిల్లలు మత్తు పానీయాలకు, దుర్వ్యసనాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నియోజకవర్గ ఎస్‌సీ ఆర్‌పీ సొసైటీ కన్వీనర్ రాము మాట్లాడుతూ మన ఓటు మనకే వేసుకుని రాజ్యాధికారంలోకి రావాలన్నారు. సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వరంగాల సంస్థలను ప్రవేట్ పరం చేస్తూ పేదలకు అన్యాయం చేస్తుందన్నారు. ప్రధాన కథకుడు షేక్ బాపూజీ అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రన బుర్రకథ రూపంలో చెప్పి ప్రజలను అలరించారు. కార్యక్రమంలో దయారత్నం, డీఎస్ బాబు.రాజేంద్రప్రసాద్, ఎస్ఎ సలీంబాబు, రాహేలు గ్రామ యువకులు వందనం, రవి, రత్న కిషోర్, కిషోర్ బాబు, ఆనంద్, విద్యార్థులు కావ్య, అనన్య, సాత్విక పాల్గొన్నారు.

‘వన్ డే యాజ్ ఏ సైంటిస్ట్’కి సాయిరెడ్డి ఎంపిక



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కె.హేమంత్ సాయిరెడ్డి జాతీయ స్థాయిలో జరిగే అరుదైన ‘వన్ డే యాజ్ ఏ సైంటిస్ట్’ కార్యక్రమానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థి కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. హేమంత్ సాయిరెడ్డి హైదరాబాదులోని సీఎస్ ఐఆర్ పరిశోధన సంస్థలో ఈ నెల 21న ‘వన్ డే యాజ్ ఎ సైంటిస్ట్’ గా పాల్గొంటాడు. శాస్త్రవేత్తలతో పని చేయడం, వారికి సహాయకుడిగా ఉండడం, ముఖాముఖీ, ప్రయోగాలు, ప్రయోగశాల పర్యటన, జీవ శాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రం, జీవకణ పరిశోధన వంటి అంశాలపై ప్రయోగ అనుభవం పొందడమే కాకుండా ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలతో మమేకం అయ్యే అవకాశం ఉంటుంది. ఇది భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా మారాలనే ప్రేరణనిచ్చే అవకాశం అవుతుంది.

పోక్సో కేసు రాజీ కోసం పోలీసుల వేధింపులు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, బాధిత కుటుంబ సభ్యుల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి వినతి



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు

నరసరావుపేట: ఓ బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు పెట్టిన తల్లిదండ్రులను రాజీ కోసం కొట్టి హింసించి వేధిస్తున్న నరసరావుపేట రూరల్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి అదనపు ఎస్పీ జేవీ సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. నాదెండ్ల గొరిజవోలుకు చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండెబోయిన శ్రీనివాసరావు నరసరావుపేట మండలంలోని దొండపాడులో ఓ యువతి వివాహం చేసుకున్నాడని, వారికి 17ఏళ్ల మైనర్ బాలిక ఉందని తెలిపారు. గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆమెను ప్రతిరోజు వెంటపడుతూ వేధిస్తున్నాడని చెప్పారు. దీంతో ఆ బాలికను అమ్మమ్మ ఊరు దొండపాడులో ఉంచారని వివరించారు. యువకుడు ఈ విషయం తెలుసుకొని దొండపాడు వచ్చి వెళుతుండటంతో ఆ బాలిక సోదరుడు, గ్రామస్తులు కలిసి మందలించి పంపించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ మైనర్ బాలిక మానసికంగా కుంగిపోయి పురుగుమందు తాగగా ప్రభుత్వాసుపత్రిలో చేర్చారని తెలిపారు. చికిత్స పొందుతున్న సమయంలో పోలీసులు బాలిక నుంచి రిపోర్టు తీసుకొని ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారని గోపిరెడ్డి చెప్పారు. ఆ బాలిక 11రోజులపాటు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకుందన్నారు. అయితే, ఆ కేసును తప్పించుకునేందుకు రాజీ కోసం తల్లితండ్రులు కుమారుడు అదృశ్యమయ్యాడనే ఫిర్యాదును నరసరావుపేట రూరల్ పోలీసులకు ఇచ్చారని చెప్పారు. కేసులో తప్పకుండా శిక్ష పడుతుందనే ఉద్దేశంతో నెల రోజుల నుంచి బాలిక తల్లితండ్రులు, సోదరుడితో పాటు గ్రామస్తులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి వేధించటం ప్రారంభించారని గోపిరెడ్డి ఆరోపించారు. బాలిక సోదరుడిని పోలీసుస్టేషన్‌కు పిలిచి కొట్టారన్నారు. శరీరంపై పడిన దెబ్బల మచ్చలను మీడియాకు చూపించారు. పోలీసులు ఈ విధంగా వ్యవహరించటం దారుణమని ఆయన ఖండించారు. బెంగుళూరు, తిరుపతి ప్రదేశాల్లో ఆ యువకుడిని దాచిపెట్టి రాజీకోసం ఈవిధంగా తప్పుడు కేసులు పెట్టి బాధిత కుటుంబాన్ని వేధించటం రెడ్‌బుక్ రాజ్యాంగానికి పరాకాష్ట అని గోపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు పక్షాన నిలబడాల్సిన పోలీసులు ఒక్కపార్టీ వైపే ఉండటం చాలా దారుణమని ఆయన విమర్శించారు. ఎస్పీ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధిత కుటుంబం సభ్యుడైన శ్రీనివాసరావు మీడియాతో జరిగిన విషయం చెప్పారు. కార్యక్రమంలో దొండపాడు గ్రామ సర్పంచ్ జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాధిత బాలిక కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈఎం. స్వామి, షేక్ కరిముల్లా, సుబ్రహ్మణ్యం నాయి పాల్గొన్నారు.

ఏపీ సార్వత్రిక ప్రవేశాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్‌స్కూలు పదో తరగతి, ఇంటర్మీడియేట్ ప్రవేశాలకు చెందిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు. దీనిలో డీఇఓ ఎల్.చంద్రకళ, డీఆర్‌ఓ మురళి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలి

ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ



బాపట్ల: చిన్నగంజాం మండలం కడవకుదురు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బినామీ కూలీలను ఏర్పరచుకొని రూ. 26 లక్షల ఉపాధి నిధులు స్వాహా చేశాడని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ ఆరోపించారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌లో డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్‌కు వినతి పత్రం అందించారు. బినామీ కూలీలను ఏర్పాటు చేసి ఉపాధి నిధులు దిగమింగిన ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో ఎంఎస్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దె త్యాగరాజు, కొలకలూరి విజయ్ కుమార్ మాదిగ, వంశీ మాదిగ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటికి చేదు అనుభవం



నరసరావుపేట: నాదెండ్లలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు చేదు అనుభవం ఎదురైంది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో నారాయణస్వామి మఠం ఏరియాలో పర్యటించారు. ఈ సమయంలో టీడీపీ కార్యకర్తలు అసంతృప్తి వెళ్లగక్కారు. పొగాకు కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు అధికారులు కొనుగోలు చేయకుండా, తక్కువ ధరతో రైతులను మోసగిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. నిబంధనల పేరిట పొగాకును తిరస్కరిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అంతేకాక గ్రామంలో చోరీలు అధికంగా జరుగుతున్నాయని, ఇప్పటికే సుమారు 10కి పైగా బైకులు చోరీకి గురయ్యాయని ఆయన దృష్టికి తెచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామస్తులు సమస్యలను వివరిస్తుండగానే ఎమ్మెల్యే పుల్లారావు పట్టించుకోకుండా కారు ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

డీఆర్వోకు వినతి



ప్రజలు సంతకాలు చేసిన పత్రాలను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాపట్ల: బాపట్ల ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర వహించటంతోపాటు మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావు విగ్రహాన్ని బాపట్లలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని వైఎస్సార్ సీపీ నాయకులు డీఆర్వో గంగాధర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ప్రజల నుంచి సేకరించిన సంతకాల పేపర్లను డీఆర్‌ఓకు అందించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు మురుప్రోలు ఏడుకొండలరెడ్డి మాట్లాడుతూ బాపట్ల ప్రాంతానికి కృష్ణాజలాలను తెప్పించటంలో కీలకమైన పాత్ర పోషించిన కోన ప్రభాకరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కొంతమంది అడ్డుకోవటం సరైన పద్ధతి కాదన్నారు. పాతబస్టాండ్‌లో పునఃస్థాపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, నాయకులు మచ్చా శ్రీనివాసరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ఉదాసీనత తగదు

మున్సిపల్ ఇంజినీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



శిబిరంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

రేపల్లె: సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం తగదని మున్సిపల్ ఇంజినీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, ఇతర సమస్యలపై నెల రోజుల నుంచి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం బాధాకరమన్నారు. చాలీచాలని వేతనాలతో బాధపడుతున్న కార్మికులను ఆదుకోవాల్సిందిపోయి ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందన్నారు. జీఓ 36 ప్రకారం వెంటనే వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను సత్వరం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె కొనసాగుతుందని చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకరరావు, రవి, రాఘవేంద్రరావు, సుబ్బారావు, శ్రీనివాస్, గీత, అనూష, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి : ఒకరికి తీవ్రగాయాలు

మేదరమెట్ల: ఇంటి మెట్ల విషయంలో వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాయ్యాడు. ఈఘటన కొరిశపాడు మండలంలోని రాచపూడి గ్రామంలో సోమవారం జరిగింది. ఏఎస్సై సుబ్బారావు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భద్రయ్య ఇంటి మెట్ల విషయంలో రెండురోజుల కిందట పూర్ణ చంద్రమౌళి, మధుసూదనరావుకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈక్రమంలో మాటామాట పెరిగి పూర్ణచంద్రమౌళి మధుసూదనరావుపై దాడి చేశాడు. వెంటనే మధుసూదనరావు చెన్నైలో ఉంటున్న తన కుమారుడు కార్తీక్‌కు దాడి విషయం చెప్పాడు. సమాచారం తెలుసుకున్న కార్తిక్ చెన్నై నుంచే ఒక కత్తి కొనుగోలు చేసి గ్రామానికి వచ్చాడు. సోమవారం ఉదయం గ్రామంలో పూర్ణ చంద్రమౌళి, మధుసూదనరావు, కుమారుడు కార్తిక్ ఘర్షణ చోటుజరిగిన ప్రదేశానికి చేరుకుని మరోసారి వాగ్వాదం చేసుకున్నారు. ఈసమయంలో కార్తిక్ తన వెంట తెచ్చుకున్న కత్తితో పూర్ణ చంద్రమౌళిపై దాడి చేయగా మెడకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు కొరిశపాడు పోలీసులకు సమాచారాన్ని అందించారు. తీవ్రంగా గాయపడిన పూర్ణచంద్రమౌళిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పూర్ణచంద్రమౌళి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి, అధికారులు కుమ్మక్కయారు

- 18 ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు అంటూ మోసం
- కారుచౌకగా భూములు కొట్టేయాలని చూస్తున్న వైనం
- వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు



ఎంపికైన గ్రామ, బూత్ కమిటీలతో మండల కన్వీనర్ కృష్ణబాబు

బల్లికురవ: సోలార్ ప్రాజెక్ట్ కోసం కారుచౌకగా భూములు కొట్టేయాలని మంత్రి, అధికారులు కుమ్మక్కయారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి మండలంలోని కొప్పరపాలెంలో గ్రామంలో గ్రామ బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, భౌతికంగా దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని ఎస్ఎల్ గుడిపాడు, కుందుర్రు, మావిళ్లపల్లి, మక్కెనవాపాలెం గ్రామాల్లోని 18 ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నామంటూ 3 నెలలుగా మంత్రి అధికారులతో కలిసి తక్కువ ధరకే భూములు కాజేయాలని కుట్ర పన్నారని చెప్పారు. ఆ భూములు కోల్పోతే రైతులకు మనుగడే లేదని కృష్ణబాబు వివరించారు. ఈ విషయమై రైతులకు సోమవారం గ్రీవెన్స్‌లో వినతి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కొప్పరపాలెం గ్రామ, బూత్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మాగులూరి శివారెడ్డి, గొర్రెపాటి దానయ్య, యర్రకుల వెంకటేశ్వర్లు, కొయ్యలమూడి వెంకటేశ్వర్లు మరో 30 సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ప్రత్తిపాటి అక్కయ్య ఎస్సీ సెల్ మహిళాధ్యక్షురాలు, కోయలమూడి శింగయ్య స్థానిక నేతలు ఆల్గొన్నారు.

నేడు ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నట్టు పల్నాడుజిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష్య, కార్యదర్శులు మానం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సి.సి.ఆదెయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ సవరణను రద్దు చేయాలనీ, కేంద్రంలో 8వ పే కమిషన్, రాష్ట్రంలో 12వ పే కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేసారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ఉచిత జాబ్ ట్రైనింగ్ తెనాలిలో ప్రముఖ విద్యాసంస్థలో 3 నెలలు ఫ్రీ హాస్టల్, జాబ్ ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ప్లేస్మెంట్. అ:10th పాస్ ఆసక్తి ఉన్న వారు సం: No.92907 69284

REAL ESTATE

HOUSE FOR SALE

■తెనాలి మారీసుపేట శివాలయం దగ్గర పడమర దిశగా 69గజాలు G+3 ఇండిపెండెంట్ బిల్డింగ్ (15వేల రెంట్ వచ్చే) అమ్మకం 8328528633

SERVICES

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 8142292071

■బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్రః 87907 41166

■బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. 88024 89999

WANTED

■తెనాలిలోనిప్రముఖ దంతవైద్యశాలకు కంప్యూటర్ ఆపరేటర్ (M/F) కావలెను. ఆకర్షణీయమైన జీతం. 9am to 9pm సంప్రదించండి. 81065 22261

■ఇంటి ఆహార వాణిజ్య సంస్థ హోమ్ థాలి GNTలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ F/T: 20-30 వేలు, P/T: 10-15 వేలు కావలెను. 98885 62228

■Wanted Teachers to Teach 1st to 8th Classes Maths and Science. please contact Phone Number : 90525 83553

■తెనాలిలోని ప్రముఖ జ్యోతి ఫర్నిచర్ మాల్ నందు వర్కర్స్ జెంట్స్ స్టాఫ్ కావలెను. జీతం: 8-12వేలు లోకల్ వారికి ప్రాధాన్యత. సం॥ 6281252588

■వేదం ఓల్డేజ్ హోమ్ వృద్ధులను సేవ చేయుటకు అనుభవం కలిగిన వర్కర్ వంటమనిషి కావలెను. భార్యాభర్తలు. 7780791297, 9642791297

■ఓల్డ్ క్లబ్ రోడ్ ఆపిల్ డెంటల్‌లో పనిచేయుటకు Chair Side Assistant కావలెను. గుంటూరు లోకల్ వారికి మాత్రమే. సంప్ర॥ 6302243437

■Wanted Local Boys / Girls at jewellery shop in guntur. experience in jewellery sales must. Cell : 9848333267

■గుంటూరులోని ప్రముఖ బ్రాండెడ్ వాచెస్ షోరూమ్‌లో పనిచేయుటకు సేల్స్ మాన్ M/F కావలెను. అనుభవం గల వారు జీతం: 13-15K. 9441665758

■Wanted B-Pharmacy, D-Pharmacy Candidates to work in a pharmacy in guntur city. PCi registration mandatory. 6300975241

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695. ఇ-మెయిల్ : armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 6(2) నిబంధనలతో రూల్ 9(1)తో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible] తేది.31.07.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" [illegible]

ఇ-వేలం తేది & సమయం: తేది.31.07.2025, ఉ॥12.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (క్ర.నెం.1 కొరకు) & మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (క్ర.నెం.2 కొరకు) [illegible] ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 30.07.2025, సా॥ 4.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 30.07.2025, సా॥ 4.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, విజయవాడకు బదిలీ చేయడమైనవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	సిఎస్ నగర్ బ్రాంచ్, గుంటూరు మెస్సర్స్ హర్షిత కాటన్ ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీ [illegible] సుబ్బారావు, తండ్రి : శివ రామయ్య బకాయి మొత్తం : రూ. 242.94 లక్షలు	ఆస్తి–1: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, కొండెపాడు గ్రామం, స.నెం.56 వద్ద 242.00 చ.గ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలమునకు హద్దులు: డీడ్ ప్రకారం.	రూ. 4.13 లక్షలు	రూ.0.42 లక్షలు
		ఆస్తి–2: గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మండలం, కొండెపాడు గ్రామ పంచాయతీ, డోర్ నెం. 1–74, స.నెం.[illegible] వద్ద 121.[illegible] చ.గ॥ల విస్తీర్ణంలో [illegible] హద్దులు: డీడ్ ప్రకారం.	రూ.5.85 లక్షలు	రూ.0.59 లక్షలు
		ఆస్తి–3: గుంటూరు, [illegible] నగర్, స.నెం.1522 వద్ద [illegible] ఫ్లాట్ నెం.416. హద్దులు: డీడ్ ప్రకారం.	రూ.26.30 లక్షలు	రూ.2.63 లక్షలు
2	బ్రాడీపేట బ్రాంచ్, గుంటూరు మెస్సర్స్ సాయి [illegible] ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీ శ్రీనివాస్ వేతంచర్ల, తండ్రి : వి. వెంకటేశ్వర్లు బకాయి మొత్తం : రూ.43,98,307.22	(డాక్యుమెంట్ నెం.1093/1994 ప్రకారం): గుంటూరు జిల్లా, చిలకలూరిపేట, బ్లాక్ నెం.7, గాంధీపేట, పాత పోస్ట్ ఆఫీస్ రోడ్డు, డోర్ నెం.7–262 లోని 101 చ.గ॥ల విస్తీర్ణంతో గల నివాస ఇంటి యొక్క ఆస్తి శ్రీ వేతంచర్ల శ్రీనివాస్, తండ్రి : వెంకటేశ్వర్లు గారి పేరున కలదు. హద్దులు: డీడ్ ప్రకారం.	రూ. 40.90 లక్షలు	రూ. 4.10 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: తేది.28.07.2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో పర్యాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విజయవాడ అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 8331011695.

బ్యాంకుకు తెలిసిన / తెలియని బకాయిలు / ట్యాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతో పాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. అదనపు బిడ్ మొత్తం ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్న వాటికి రూ.10,000/- గుణింపులో పెంచవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్న వాటికి రూ. 25,000/- గుణింపులో పెంచవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ.50,000/- గుణింపులో పెంచవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసే లోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.

ఇ-వేలం విధానం, నియమ నిబంధనలు కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి : మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ (baanknet). వెబ్‌పోర్టల్ : "https://baanknet.com/eauction-psb", హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848/8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది : 14-07-2025, ప్రదేశం : విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్